శ్రీ తుంబుర నారద నాదామృతం



రామ్‌ప్రసాద్‌ను సన్మానిస్తున్న రేలంగి నరసింహారావు, వంశీ రామరాజు

చిక్కడపల్లి: రామ్‌కుమార్ కళారవిందం సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నటసింహం నందమూరి బాలకృష్ణ 50 వసంతాల గానాభిషేకం 'శ్రీ తుంబుర నారద నాదామృతం' శీర్షికతో త్యాగరాయగానసభలో నిర్వహించిన సినీ సంగీత విభావరి అలరించింది. గాయనీగాయకులు పాల్గొని ఎంపిక చేసుకున్న గీతాలను మధురంగా ఆలపించారు. అనంతరం జరిగిన సమావేశంలో సినీదర్శకులు జి.రామ్‌ప్రసాద్‌ను ప్రముఖ సినీదర్శకులు రేలంగి నరసింహారావు ముఖ్యఅతిథిగా హాజరై సన్మానించారు. ఈ కార్యక్రమంలో వంశీ రామరాజు, రామ్‌కుమార్, ప్రముఖులు కోదండరామ్, రేణుకారామ్, రేవతి, కృష్ణ పెరి, నాగేందర్, రమేష్‌కుమార్, శ్రీలక్ష్మి, కృష్ణవేణి, భార్గవినాగరాజ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సుందరకాండ దాసు

సుందరకాండను సామాన్యులు పాడుకునేలా చేసిన గొప్ప వ్యక్తి ఎమ్మెస్ రామారావు



ఎమ్మెస్ రామారావు యాదిలో జరిగిన కార్యక్రమంలో కళాజనార్దన మూర్తి, చక్రపాణి, చిక్కా రామదాసు

చిక్కడపల్లి: సుందర దాసు, ఎమ్మెస్ రామారావు తెలుగు చిత్ర సీమలో తొలి నేపథ్య గాయకుడని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ అన్నారు. త్యాగరాయ గానసభ నిర్వహణలో బుధవారం రాత్రి ఎందరో మహానుభావులు మధుర స్మృతులలో భాగంగా సుందరకాండ ఎమ్మెస్ రామారావు యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. సుందరకాండను సామాన్య ప్రజలు పాడుకునేలా అందించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఆయన రచించిన ఆకాశవాణిలో గానం చేసిన సుందరకాండ నేటికీ వినిపిస్తుందన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు గానసభ సంయుక్త కార్యదర్శి టీ.చక్రపాణి, కవి చిక్కా రామదాసు, గాయకులు త్రినాథరావు, పులిపాక రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల స్వీకరణ

కాచిగూడ: డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, ఎంసీఏ, ఎంబీఏ, ఎల్ఎల్ఎం తదితర ఉన్నత చదువుల్లో రాణిస్తున్న ప్రతిభావంతులైన మున్నూరుకాపు విద్యార్థులకు 'ప్రతిభా పురస్కారాలు–2024'లను ప్రదానం చేస్తున్నట్లు మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టుబోర్డు చైర్మన్ ప్రొ. మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. బుధవారం కాచిగూడలోని ట్రస్టుబోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వార్షిక పరీక్షల్లో 80శాతానికి పైగా మార్కులు సాధించిన అర్హులైన విద్యార్థులు అక్టోబర్ 10వ తేదీ లోగా దరఖాస్తులను అందజేయాలని సూచించారు. వివరాలకు ఫోన్ నం.94916 27404, 040–24658160.

నిమజ్జనానికి ఆటంకం లేకుండా చర్యలు



అంబర్‌పేట ఫ్లైఓవర్ ప్రాంతంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న అడిషనల్ కమిషనర్ విక్రమ్‌సింగ్

అంబర్‌పేట: గణేష్ శోభయాత్రకు అంబర్‌పేటలో ఆటంకం లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు నగర పోలీస్ అడిషనల్ కమిషనర్ విక్రమ్ సింగ్ తెలిపారు. అన్ని విభాగాల అధికారులు వినాయక నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అంబర్‌పేట ప్రధాన రోడ్‌పై నిర్మిస్తున్న ఫ్లైఓవర్‌తో శోభాయాత్రకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. బుధవారం ట్రాఫిక్, జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి అంబర్‌పేట ఫ్లైఓవర్ నిర్మాణ ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. ఉప్పల్, రామంతాపూర్ నుంచి వచ్చే గణనాథులను తాత్కలికంగా శ్రీరమణ చౌరస్తా మీదుగా ఛేనంబర్ చౌరస్తా, తిలక్‌నగర్ వైపు వెళ్లేలా యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలన్నారు. నిర్మాణ ప్రాంతంలో గుంతల రోడ్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ పర్యటనలో ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ విశ్వప్రసాద్, ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి, అడిషనల్ డీసీపీ నర్సయ్య, డీఎంసీ మారుతీ దివాకర్, ఏసీపీ రఘు, ఇన్‌స్పెక్టర్ అశోక్, ఏఎంహెచ్‌వో డా. హేమాలత తదితరులు ఉన్నారు.

15న గణపతి హోమం

నల్లకుంట: ఫ్రెండ్స్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యూనల్లకుంట బ్రాహ్మణ హాస్టల్ వీధిలోని దత్తపీఠం వద్ద ఏర్పాటు చేసిన మండపంలో గణనాథుడు విశేష పూజలు అందుకుంటున్నాడు. 41వ నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 15న ఉదయం 5.30 గంటలకు గణపతి హోమం ఉంటుందని ఫ్రెండ్స్ అసోసియేషన్ ప్రతినిధి సీహెచ్. సాయిమోహన్ ఓ ప్రకటనలో తెలిపారు. గణపతి హోమం అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు అన్నదాన క్యాక్రమం ఉంటుందన్నారు. హోమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆదిదేవుని కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

సర్వమత సారాంశం భగవంతుడిని చేరడమే



స్వామి వివేకానంద విగ్రహం వద్ద ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డా. ప్రభు, విద్యార్థులు

ముషీరాబాద్: వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చికాగో సర్వమత సమ్మేళన సదస్సులో స్వామి వివేకానంద ప్రసంగించి 131ఏళ్లు పూర్తయిన సందర్భంగా అంజలి ఘటించి సంస్మరణసభ నిర్వహించారు. ఈ సభకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ కె.ప్రభు పాల్గొని మాట్లాడుతూ.. హిందూ ధర్మం ప్రత్యేకత సహనం అని నదులన్నీ సముద్రాన్ని చేరినట్లు సర్వమత సారాంశం భగవంతున్ని చేరడమేనన్నారు. అందరూ సోదరభావంతో మెలగాలని, అందుకే సంప్రీతి దివాస్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఐక్యూఏసీ కో– ఆర్డినేటర్ డాక్టర్ పద్మ, సీఈవో డాక్టర్ కుమారస్వామి, డాక్టర్ ఆంజనేయులు, డా.తిరుపతి, డా.శ్రీను, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు డా. పద్మజ, డా.మహేష్, కె.నీరజ, డా.జగన్, డా. శ్రీనివాస్‌రావు, ఇర్ఫానా, శ్రీధర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయండి



జోనల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

అంబర్‌పేట: నియోజకవర్గ అభివృద్ధికి ప్రతిపాదించిన పనులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ జీహెచ్ఎంసీ సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్‌ను బుధవారం ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. సుమారు రూ.11 కోట్ల అభివృద్ధి పనుల కోసం ప్రతిపాదనలు చేశామని పేర్కొన్నారు. నిధులను మంజూరు చేసి అభివృద్ధికి సహకరించాలని కోరారు. నిధుల మంజూరుకు కృషి చేస్తానని జెడ్సీ హామీ ఇచ్చారని స్పష్టం చేశారు.

తల్లిదండ్రులు లేని విద్యార్థులకు ఆర్థిక సాయం

కాచిగూడ: మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం ట్రస్టుబోర్డు ఆధ్వర్యంలో తల్లిదండ్రులు లేదా సంరక్షకుడిని కోల్పోయిన విద్యార్థులకు స్కూల్ ఫీజుల కోసం ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు ట్రస్టుబోర్డు చైర్మన్ ప్రొ. మ్యాడం వెంకట్‌రావు తెలిపారు. ఒకటో తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న అర్హులైన విద్యార్థులు అక్టోబర్ 10వ తేదీలోగా కాచిగూడలోని ట్రస్టుబోర్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో ట్రస్టీ సభ్యులు పన్నాల విష్ణువర్ధన్, పిల్లి శ్రీనినవాస్‌రావు, ఆకుల నగేష్, దేవేందర్, చంద్రశేఖర్, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

భారతీయులను అవమానించేలా రాహుల్ వ్యాఖ్యలు

బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

కాచిగూడ: కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ విదేశాల్లో పర్యటిస్తూ భారత్‌ను కించపర్చడమే కాకుండా ఎన్నికల వ్యవస్థను విమర్శిస్తున్నారని బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. బుధవారం బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో జరిగి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భారతీయులను అవమానించేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేస్తున్నారని విమర్శించారు. అమెరికా పర్యటనలో ఉన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దేశం ప్రజాస్వామ్యం పట్ల భారతదేశ ప్రజలను అవమానించేలా వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఓడిపోయినంత మాత్రాన ప్రజాస్వామ్యం లేదనే ఇంగిత జ్ఞానం లేకుండా మాట్లాడటం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న రైసింగ్ హ్యాండ్స్ సొసైటీ ప్రతినిధులు

కాచిగూడ: రైసింగ్ హ్యాండ్స్ సొసైటీ 13వ వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకుని అంబర్‌పేటలోని ప్రభుత్వ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు అనంద్‌గౌడ్, రైసింగ్ సొసైటీ అధ్యక్షుడు రాజేష్ ప్రజాపతి తదితరులు పాల్గొన్నారు.

యుద్ధప్రాతిపదికన రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు

కాచిగూడ: నగరంలో కురిసిన భారీ వర్షాల వల్ల రోడ్లు అధ్వానంగా మారాయని... డ్రైనేజీ, మంచి నీటి పైపులైన్ వ్యవస్థలు అస్తవ్యస్తంగా మారాయని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు ఆందోళన వ్యక్తం చేశారు. బర్కత్‌పురలోని పార్టీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భాగ్యనగరంలో జరుగుతున్న వినాయక ఉత్సవాలను దృష్టిలో పెట్టుకుని జీహెచ్ఎంసీ, వాటర్ వర్క్స్ శాఖలు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని కోరారు. రోడ్లు, డ్రైనేజీ మంచినీటి పైప్‌లైన్ వ్యవస్థలు దెబ్బతినడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వినాయక నిమజ్జనం ఊరేగింపులు ప్రారంభమైన నేపథ్యంలో భక్తులు అనేక సమస్యలు ఎదుర్కొనే అవకాశం ఉందని చెప్పారు. అదే విధంగా రోడ్లపై పెరిగిన చెట్ల తొలగింపు చేపట్టడంతో పాటు రోడ్లపై వదిలేస్తున్న చెట్ల కొమ్మలు తొలగించాలని కోరారు. విద్యుత్ కోతలు నివారించాలని, ఉత్సవాలపై ఎలాంటి ఆంక్షలు విధించొద్దని ఆయన తెలిపారు.

వరద బాధితులకు నెల వేతనం విరాళం



ముషీరాబాద్: అకాల వర్షాలకు సర్వస్వం కోల్పోయిన ప్రజలకు అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాల్సిన అవసరం ఉందని రాజ్యసభ ఎంపీ ఎం.అనిల్‌కుమార్ అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు వరద బాధితుల సహాయార్థం తన వంతు సాయంగా ఒక నెల వేతనాన్ని సీఎం రిలీఫ్‌ఫండ్‌కు అందజేశానన్నారు. ఈ మేరకు బుధవారం సెక్రటేరియట్‌లోని ముఖ్యమంత్రి సహాయ నిధి కార్యాలయంలోని సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాస్‌ను కలిసి చెక్కును అందజేసినట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, వాణిజ్య సంఘాలు విరివిగా విరాళాలు ఇచ్చి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

పార్కు పనులు త్వరగా పూర్తి చేయించండి



నరేంద్ర పార్కు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: పార్కుల్లో చేపట్టిన అభివృద్ధి, సుందరీకరణలో జాప్యం జరగకుండా త్వరితగతిన పూర్తి చేయించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అధికారులను ఆదేశించారు. బుధవారం నల్లకుంటలోని నరేంద్ర పార్కును ఆయన సందర్శించారు. సుందరీకరణ పనులను పరిశీలించి జీహెచ్ఎంసీ, ఉద్యానవన శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో నరేంద్ర పార్కు కమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రాధాష్టమి మహోత్సవం

నల్లకుంట: నల్లకుంట డివిజన్ పరిధిలోని టీఆర్టీ కాలనీలోని కుసుమ హరనాథ ఆశ్రమంలో బుధవారం రాధాష్టమి మహోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 10.30 గంటలకు రాధమ్మకు మహాభిషేకం కావించి, అనంతరం అమ్మవారికి పుష్పాభిషేకం చేసి హారతి ఇచ్చారు. అబిడ్స్ ఇస్కాన్ ఆలయం స్వామిజీలు, కుసుమ హరనాథ ఆశ్రమం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలి



చిక్కడపల్లి: ఆధ్యాత్మిక చింతనను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని కార్పొరేటర్ పావని వినయ్‌కుమార్ అన్నారు. కలియుగ ప్రత్యక్ష దైవమైన వేంకటేశ్వరస్వామిని బుధవారం దర్శించుకున్న అనంతరం బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ కన్వీనర్ వినయ్‌కుమార్‌తో కలసి ఆమె మాట్లాడారు. భక్తి కార్యక్రమాలు సన్మార్గంలో నడిపించేందుకు దోహదపడతాయని అన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. భక్తి, సేవా కార్యక్రమాల్లో తరచూ పాలుపంచుకోవాలని కోరారు.

'సెప్టెంబర్ 17' గురించి కాంగ్రెస్, బీజేపీకి మాట్లాడే హక్కు లేదు

- బీఎల్‌పీ వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్
- 17న స్వయం గౌరవ రాజ్యాధికార దినోత్సవం



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సెప్టెంబర్ 17న బహుజన శ్రామిక జాతుల స్వయం గౌరవ రాజ్యాధికార సాధన దినోత్సవంగా జరుపుకోవాలని బహుజన లెఫ్ట్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దండి వెంకట్ పిలుపునిచ్చారు. బాగ్‌లింగంపల్లిలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నీ బాంచన్ దొర.. కాళ్లు మొక్కుతా అంటూ వంగివంగి దండాలు పెట్టిన బహుజనులతో బంధూకులను పట్టించి ప్రపంచ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిన దినం అని అన్నారు. 1946–51 వరకు జరిగిన మహత్తర తెలంగాణ సాయుధ పోరాటంలో బహుజన శ్రామిక జాతులు ప్రతిఘటించిన తీరు స్ఫూర్తిదాయకమని అన్నారు. అందుకే బహుజన శ్రామికజాతుల వారు స్వయం గౌరవ రాజ్యాధికార సాధన దినోత్సవంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. నాటి తెలంగాణ సాయుధ పోరాటాన్ని మతోన్మాదానికి వాడుకున్న బీజేపీకి, ఉద్యమాన్ని రక్తపుటేరుల్లో ముంచి నిజాంకు రాజ్‌ప్రముఖ్ బిరుదును ప్రదానం చేసిన కాంగ్రెస్ పార్టీకి సెప్టెంబర్ 17 గురించి మాట్లాడే హక్కు లేదన్నారు.

ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ పెంచాలి

ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి కన్వీనర్ చెన్నయ్య



లోయర్ ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు

కవాడిగూడ: ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్లను వర్గీకరించే అధికారాన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఇస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును నిరసిస్తూ బుధవారం ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సమితి కన్వీనర్ జి.చెన్నయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ, ఎస్టీ అభివృద్ధిపై శ్వేతపత్రాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పెరిగిన జనాభా దామాషా ప్రకారం ఎస్సీ, ఎస్టీల రిజర్వేషన్ పెంచాలన్నారు. ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేసి ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. అసైన్మెంట్ భూములను అర్హులైన ఎస్సీ, ఎస్టీలకు పంపిణీ చేసి, అత్యంత వెనుకబడిన కులాల వారికి ప్రత్యేక కార్యాచరణను రూపొందించి, వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. షెడ్యూల్డ్ కులాల మధ్య హెచ్చుతగ్గులు లేకుండా అందరికీ సమన్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కో–కన్వీనర్లు బూరుగుల వెంకటేశ్వర్లు, చెరుకు రామచందర్, జంగా శ్రీనివాస్, ఆవుల సందీప్, మన్నే శ్రీరంగం, ఆనందరావు, స్వరూప, రాణి, లలిత తదితరులు పాల్గొన్నారు.

23న సంక్షేమ భవన్ ముట్టడి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో చదువుతున్న విద్యార్థుల మెస్ చార్జీలు రూ.2500లకు పెంచాలని డీఏహెచ్ హాస్టల్ విద్యార్థులకు పాకెట్ మనీ రూ.2500 ఇవ్వాలనే డిమాండ్‌తో 23న చలో సంక్షేమ భవన్ హైదరాబాద్‌కు విద్యార్థులు పెద్ద సంఖ్యలో తరలి రావాలని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు పిలుపునిచ్చారు. బుధవారం చిక్కడపల్లిలోని రాష్ట్ర కార్యాలయంలో చలో హైదరాబాద్ గోడ పత్రికను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. సాంఘిక సంక్షేమ హాస్టల్స్‌లో దళిత నిరుపేద విద్యార్థులు అనేక సమస్యల నడుమ జీవిస్తున్నారని అన్నారు. రోజు వారీగా పెరుగుతున్న నిత్యావసర ధరలు కూరగాయల ధరల వల్ల ప్రస్తుతం ఇస్తున్న రూ.1250 సరిపోవడం లేదన్నారు. మెస్‌చార్జీలు పెంచకపోవడం వల్ల నాణ్యమైన ఆహారాన్ని నోచుకోవడం లేదన్నారు. వెంటనే మెస్‌చార్జీల పెంపు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రాష్ట్ర సహాయ కార్యదర్శి తిప్పారపు సురేష్, ఎం.ప్రకాష్, జిల్లా అధ్యక్షులు ఎం.దశరథ్, రజనీకాంత్, పూజ, వినయ్, సాగర్, వినోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు ఆహ్వానం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: హక్కుల ఉద్యమ నేత బొజ్జ తారకం 8వ వర్ధంతి సభను ఈనెల 16న సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నామని ఆర్పీఐ రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య తెలిపారు. ఈ కార్యక్రమానికి రావాల్సిందిన బుధవారం ఎమ్మెల్సీ తీర్మాన్ మల్లన్నకు ఆహ్వాన పత్రికను అందజేశారు. మధ్యాహ్నం 2గంటల నుంచి జరిగే ఈ వర్ధంతి సభలో పెద్ద ఎత్తున ఉద్యమకారులు, మేధావులు, విద్యార్థులు పాల్గొనాలని పిలుపునిచ్చారు.



భారీ మోసాలకు పాల్పడిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి

ధన్వంతరి ఫౌండేషన్ బాధితుల ఫోరం డిమాండ్



సమావేశంలో మాట్లాడుతున్న గిరిప్రసాద్‌శర్మ

చిక్కడపల్లి: ధ్వనంతరి ఇంటర్నేషనల్ ఫౌండేషన్ పేరిట నగరంలో భారీ మోసాలకు పాల్పడిన వ్యక్తిపై కఠినమైన చర్యలు తీసుకోవాలని ధన్వంతరి ఫౌండేషన్ బాధితుల ఫోరం కన్వీనర్ గిరిప్రసాద్‌శర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం జరిగే వరకు రాజీలేని పోరాటం చేస్తామన్నారు. బుధవారం చిక్కడపల్లిలోని త్యాగరాయ గానసభలో ధన్వంతరి ఫౌండేషన్ బాధితుల అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఫౌండేషన్ పేరిట అధిక వడ్డీ చెల్లిస్తామని ఆశచూపి రూ.514కోట్లను డిపాజిట్లు సేకరించిన కమలాకరశర్మ నిందితుడని సీసీఎస్ పోలీసులు గుర్తించారని ఆయన తెలిపారు. సీసీఎస్ పోలీసులు అకౌంట్‌ను సీజ్ చేశామని ప్రకటించినప్పటికీ డబ్బులు విత్‌డ్రా జరగడంతో అంతర్యమేమిటని ప్రశ్నించారు? నిందితుడు తనకు ఎలాంటి సంబంధం లేదంటూ కోర్టు, సీసీఎస్ పోలీసులను తప్పుదోవపట్టిస్తున్నారని అన్నారు. అందరూ ఐక్యంగా ఉంటూ న్యాయం జరిగే వరకు పోరాడదామని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్రేయశర్మ, బాధితులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీగణనాథం.. భజామ్యహం.!



వివేక్‌నగర్ ఆంజనేయస్వామి ఆలయంలో..



శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో పూజలు



బాగ్‌అంబర్‌పేటలో గణపతి పూజలో...



పటేల్‌నగర్‌లో జరిగిన పూజలో యశ్వంత్





సాయిబాబా మందిరంలో గణనాథుడికి లక్ష పుష్పార్చన పాల్గొన్న భక్తులు



గణేష్ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఉదయ, సంధ్య వేళల్లో గణనాథుడికి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. బుధవారం జోన్ పరిధిలోని కాలనీలు, బస్తీలు, అపార్ట్‌మెంట్లలో ఏర్పాటు చేసిన గణేశ్ మండపాలలో నిత్య పూజలు కొనసాగిస్తున్నారు. కొన్ని చోట్ల భక్తి గీతాలాపనలు, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక గణేశ్ భజన కార్యక్రమాలను వైభవంగా సాగుతున్నాయి. మధ్యాహ్నం, సాయంత్రం వేళల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు తమ వంతుగా ప్రసాదాలను భక్తులకు పంచుతూ భక్తిపారవశ్యంలో మునిగిపోతున్నారు.

– ముషీరాబాద్/అంబర్‌పేట జోన్ బృందం







అన్నదానం చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, శ్రీనివాస్‌గుప్తా, కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి



రాంనగర్‌లోని శివగణేష్ అసోసియేషన్ మండపం



ఎంపీ అనిల్‌కుమార్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు



నిమజ్జనానికి తరలుతున్న హైందవి కళాశాల గణపతి



నాగమయ్య కుంటలో...